క్లుప్తంగా

నృసింహుడిని దర్శించుకున్న జడ్జి



జడ్జిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం జిల్లా సెషన్స్ జడ్జి డి.సాధన శనివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య స్వాగతం పలికి పూజలు చేశారు. ఆలయం తరఫున సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు. చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న లావణ్య

ధర్మపురి: రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంచుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం రాయితీపై అందించే జీలుగ విత్తనాలను శనివారం పీఏసీఎస్ వద్ద రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల సమగ్ర సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. రైతులు అధైర్యపడొద్దని, తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఏవో రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సంగ నర్సింహులు, డైరెక్టర్లు, ఏఎంసీ సీఈవో అయ్యోరి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సందీప్



బాధ్యతలు స్వీకరిస్తున్న సందీప్

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నడికట్ల సందీప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కళాశాలలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: యువత అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని సర్వాపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.20,000 విరాళం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, పాక్స్ చైర్మన్ తొట్ల చంద్రశేఖర్, మ్యాక లక్ష్మణ్, కనకట్ల జలం, శనిగరపు తిరుపతి, నక్క అనిల్, జంగిలి హన్మంతు, నాగుల సంజీవ్ గౌడ్, సదాశివ రెడ్డి, బండి రవి గౌడ్, రమణ, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలీ కులోన్నతి సంఘం, యువత ఆధ్వర్యంలో శనివారం పద్మశాలీ సంఘ భవనంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి హెడ్ గుర్రం కిరణ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, ఉపాధ్యక్షుడు కటుకం వినయ్, ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్, యువత ప్రధాన కార్యదర్శి చింతకింది ప్రేమ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మల్యాల: కాంగ్రెస్ మండల, గ్రామ, బ్లాక్ అధ్యక్షుల కోసం నాయకుల నుంచి పీసీసీ పరిశీలకులు అంజన్‌కుమార్ దరఖాస్తులు స్వీకరించారు. శనివారం స్థానిక సోనియాగాంధీ గుడి వద్ద పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. దొంగ ఆనంద రెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, శనిగరపు తిరుపతి, సంత ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపల కొలను

- ఉపాధి హామీ పథకంలో నిర్మాణం
- కూలీలకు చేతినిండా పని
- మత్స్యకారులకు మేలు



సిరికొండ శివారులో చేపల కొలను తవ్వుతున్న ఉపాధి కూలీలు

కథలాపూర్: కుల వృత్తులపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోంది. మత్స్యకారుల కోసం ఉపాధి హామీ పథకంలో చేపల కొలనుల నిర్మాణం చేపడుతోంది. తద్వారా ఉపాధి కూలీలకు పని కల్పించడంతోపాటు మత్స్యకారుల ఉపాధికి భరోసా ఇచ్చినట్లయింది.

రెండు గ్రామాల్లో చేపల కొలనులు

మండలంలో 19 గ్రామాలున్నాయి. సుమారు 84 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఉపాధి పథకం కింద చేపల కొలనుల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మండలంలోని సిరికొండలోని గూండ్ల కుంటలో చేపల కొలను నిర్మాణానికి రూ. 6.94 లక్షలు, దూలూర్ నాగమల్లప్పకుంటలో రూ.7.99 లక్షలు వెచ్చించి పనులు చేయిస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. కొలనుల నిర్మాణంతో కూలీలకు చేతినిండా పని కల్పించినట్లయింది. చేపలు పెంచుకునే అవకాశం వచ్చిందని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు ఉపాధి



చెరువుల్లో నీళ్లుంటేనే చేపలు పెంచుకునే వీలుంది. కొత్తగా చేపల కొలను నిర్మించడం ద్వారా ముందస్తుగా నీళ్ల నిల్వ చేసి చేపలు పెంచుకునే అవకాశం ఉంది. అన్ని చెరువుల్లో చేపల కొలనులు నిర్మించాలి.

– దేశవేని గంగనర్సయ్య, మత్స్యకార్మిక సంఘం నాయకుడు, సిరికొండ

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పథకంలో వ్యవసాయ అనుబంధంగా ఉండే పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే చేపల కొలనుల నిర్మాణాల పనులు చేపడుతున్నాం. మండలంలో రెండు చెరువుల్లోనే చేపల కొలనులు నిర్మించాం. మిగతా చెరువుల్లోనూ నిర్మిస్తాం.

– రాజేందర్, ఏపీవో



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రం నుంచి ధర్మారం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం జగిత్యాల పాతబస్టాండ్‌లోని గొల్లపల్లి రోడ్డులో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎండ, వానకు ఇబ్బందిపడుతూ బస్సుల కోసం పడిగాపులుగాస్తున్నారు. బస్సు ఎక్కడ ఆగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకుని బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కల్పన, డిపో మేనేజర్, సెల్: 99592 25925

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి గ్రామంలో శనివారం శ్రీవేంకటేశ్వరస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవాలు, ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారి కల్యాణం జరిపించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, వెంకటేశం, ఆర్యవైశ్య సంఘం మండల ప్రతినిధులు మైలారపు నరేందర్, బచ్చు కిషన్, ముదాం శేఖర్, పాల నవీన్, వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్(రాయికల్): విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ప్రైవేటుకు దీటుగా ప్రతీ ఉపాధ్యాయుడు కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికత నేర్చుకుని విద్యాబోధన చేయాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు, డీఈవో రాము, ఎంఈవో రాఘవులు, గన్నె రాజిరెడ్డి, రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాల్గో తరగతి ఉద్యోగులు

జగిత్యాల: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధ్యక్షురాలు కె.అరుణ, కార్యదర్శి నారాయణ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో రాము

కోరుట్లటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్‌రావు, రిసోర్స్ పర్సన్స్ అందె శివప్రసాద్, మాసం చిరంజీవి, కోసరి శేఖర్, గంగుల రణధీర్, అన్నం మహేష్, సిరిపురం శ్రీనివాస్, సరిపురం రాజేష్, అంకం దామోదర్, సీఆర్పీ గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించేందుకు..

మల్లాపూర్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి వృత్యాంతర ఉపాధ్యాయ శిక్షణ తరగతులు దోహదపడుతాయని డీఈవో రాము అన్నారు. శనివారం మండలంలోని రాఘవపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సందర్శించారు. ఎంఈవో దామోదర్‌రెడ్డి, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ప్రతాప్, సీఆర్పీలు దేవారెడ్డి, విజయప్రసాద్, మహేష్, ఆర్పీలు పాల్గొన్నారు.

మన చరిత్ర భావితరాలకు అందించాలి

జగిత్యాలరూరల్(రాయికల్): మన చరిత్రను భావితరాలకు అందించాలని డీఈవో రాము ఉపాధ్యాయులకు సూచించారు. రాయికల్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం త్రికూటాలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మచ్చ శ్రీధర్, ప్రధాన అర్చకులు సతీశ్‌శర్మ, టీవైఎంఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల స్వామియాదవ్, తపస్ జిల్లా బాధ్యులు చెరుకు మహేశ్వశర్మ, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కథలాపూర్: ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలతో విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధించాలని ఉపాధ్యాయులకు రిసోర్స్‌పర్సన్లు సూచించారు. తరగతుల్లో నేర్చుకున్న అంశాలపై పరీక్షలు నిర్వహించగా, ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంఈవో లోకిని శ్రీనివాస్, రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుగ్గారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులు ముగిసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ తరగతుల వల్ల ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పరిచి విద్యార్థుల పురోభివృద్ధికి తోడ్పడాలని ఎంఈవో బోనగిరి ప్రభాకర్ సూచించారు. డీఆర్పీ నీలం సంపత్, రిసోర్స్ పర్సన్లు సత్తయ్య, సాగర్, మహేశ్, రమేశ్, శ్రీనివాస్, రమాదేవి, కల్పన, సీఆర్పీ వెంకటేశ్ పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేశారు. క్రమశిక్షణ గల కాంగ్రెస్ కార్యకర్తగా, ఎన్‌ఎస్‌యూఐ నాయకుడిగా మహేశ్‌కుమార్ పార్టీకి సేవలందించారని గుర్తు చేశారు. పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 567వ ర్యాంక్



మణికంఠ

మల్లాపూర్: పాలిసెట్ ఫలితాల్లో మండలంలోని వీవీరావుపేటకు చెందిన విద్యార్థి నానం మణికంఠ రాష్ట్రస్థాయిలో 567వ ర్యాంక్ సాధించాడని హెచ్‌ఎం సంగనభట్ల దత్తాత్రేయ తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఆర్జేసీ ఎంట్రన్స్‌లో మణికంఠ రాష్ట్రస్థాయిలో 22వ ర్యాంక్ సాధించాడని తెలిపారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న వసంత

జగిత్యాల: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. నాయకులు గంగాధర్, మహేశ్, సత్యం పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖీ కేంద్రం



మాట్లాడుతున్న సఖీ నిర్వాహకులు

జగిత్యాల: మహిళలకు సఖీ కేంద్రం అండగా నిలుస్తోందని నిర్వాహకులు శారద, భాగ్యలక్ష్మీ అన్నారు. మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓల్డ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం సమాజంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న గృహ హింస పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురిచేసినా సఖీ అండగా ఉంటుందని, టోల్‌ఫ్రీ నంబరు 181కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ధర్మపురి: పట్టణంలో సయ్యద్ అమీర్ శనివారం గంజాయి విక్రయించేందుకు యత్నించగా పట్టుకున్నట్టు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. 311 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ సేవలను పెంచాలని వినతి



మంత్రిని సన్మానిస్తున్న నర్సింగరావు, జలపతిరెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో శనివారం కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, మల్లాపూర్ మండల అభివృద్ధికి సహకరించాలని మంత్రికి వినతిపత్రం అందించామన్నారు. కోరుట్ల నుంచి మల్లాపూర్(వయా గుండంపల్లి) మీదుగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి ఆర్టీసీ బస్సులు నడపాలని, మెట్‌పల్లి–వాల్గొండ వయా మల్లాపూర్ మీదుగా నడిచే బస్సును పునరుద్ధరించాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్లతో మాట్లాడి ఆర్టీసీ బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



సదస్సులో శాస్త్రవేత్తలు, రైతులు

జగిత్యాలరూరల్(రాయికల్): సేంద్రియ ఎరువులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని పొలాస శాస్త్రవేత్తలు అసోసియేట్ డీన్ డాక్టర్ సైదా నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శేషు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీశ్ అన్నారు. శనివారం రాయికల్ మండలం మూటపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంతో నేలను సంరక్షించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. మాజీ సర్పంచ్ బెక్కం తిరుపతి, రాజేందర్‌రెడ్డి, రంజిత్, బుచ్చన్న పాల్గొన్నారు.


ఘనంగా తిరంగా యాత్ర



బండలింగాపూర్‌లో తిరంగాయాత్రలో బీజేపీ నేతలు

ధర్మపురి/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్ : ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని ధర్మపురిలో శనివారం సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో తిరంగాయాత్ర నిర్వహించారు. మెట్‌పల్లి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగాయాత్ర చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చిట్నేని రఘు, జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, వడ్డెపల్లి శ్రీనివాస్, దొనికెల నవీన్, చెట్లపల్లి మీనా, బొడ్ల నగేశ్ తదితరులు ఉన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల ప్రభుత్వ పాఠశాలలో జాతీయజెండాలు ప్రదర్శించారు. ఎంఈవో చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో చిట్నేని రఘు ఆధ్వర్యంలో తిరంగాయాత్ర నిర్వహించారు. మల్లాపూర్ మండలకేంద్రంలోని భరతమాత కూడలి వద్ద తిరంగాయాత్రను బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, లవంగ శివకుమార్, గడ్డం నర్సారెడ్డి, ముష్కరి రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ పరిశీలన



సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీఏవో భాస్కర్

కోరుట్లరూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధి యెఖీన్‌పూర్ గ్రామ శివారులోని ఓ సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ శనివారం పరిశీలించారు. రిజిస్టర్లు, బిల్‌బుక్స్ సరిగా ఉండాలని, స్టాక్ కరెక్ట్‌గా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జగిత్యాల ఏడీఏ తిరుపతి, కోరుట్ల, మెట్‌పల్లి మండల వ్యవసాయ అధికారులు నాగమణి, దీపికా పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ

జగిత్యాలరూరల్/కథలాపూర్/మల్యాల/ధర్మపురి/కోరుట్లరూరల్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం: గిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 332 మంది ఎస్సీ కార్పొరేషన్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈనెల 26, 27 తేదీల్లో బీసీ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా సుమారు 990 మందికి ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 442 మంది ఎస్సీ అభ్యర్థులను ఎంపీడీవో స్వాతి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ బీసీ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపీడీవోలు గంగాధర్, లచ్చాలు తెలిపారు. వివిధ కేటగిరీల అభ్యర్థులకు ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ధర్మపురి ఎంపీడీవో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలపరిషత్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు రాకపోవడంతో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఎం శంకర్, పంచాయతీ కార్యదర్శులు తూతూ మంత్రంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు.

క్లుప్తంగా..

గోవుల అక్రమ రవాణాను నియంత్రించాలి

మెట్‌పల్లి: బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను నియంత్రించాలని శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్, సీఐలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. మర్రి భాస్కర్, పోహార్ తుక్కారాం, సత్యనారాయణ, గుండు ప్రభాకర్, వేములవాడ రాజశేఖర్ తదితరులున్నారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇల్లు

ధర్మపురి: శుక్రవారం అర్ధరాత్రి వడగండ్ల వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన కాసనగొట్టు రవీందర్ ఇంటిపై పిడుగుపడడంతో ఇంటి సిమెంట్ ఊడిపోయి స్లాబ్ అంచు ధ్వంసమైంది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

మల్లాపూర్: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని ప్రముఖ అడ్వకేట్ ఎర్ర రమేశ్ అన్నారు. శనివారం ఎంపీడీవో శశికుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కొందరు నేతలు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇళ్లు కేటాయించుకోవడంతో పాటు లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

మల్లాపూర్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ రూ.27లక్షలు మంజూరుచేయించగా మల్లాపూర్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామిగౌడ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కోడూరి భిక్షపతి, పెదిరెడ్డి లక్ష్మణ్, నల్ల రాజేశ్వర్, బదినపల్లి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు ఉత్తమ ఎస్‌ఎచ్‌వోగా అవార్డు రావడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఉత్తమ ఎస్‌ఎచ్‌వోగా ఎస్సై అనిల్ డీజీపీ జితేందర్ చేతుల మీదుగా అవార్డు ప్రశంసాపత్రం అందుకోవడంపై శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కోరుట్ల రూరల్: మండలంలోని సర్వరాజ్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు నారాయణ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు శనివారం పరామర్శించారు. రాములు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.